



కూటమిలో ఎన్నికల జోష్ నింపిన ప్రజాగళం

దారులన్నీ బొప్పూడి వైపే!

భారీగా తరలిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



అవనిగడ్డ నుంచి చిలకలూరిపేట సభకు తరలివెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులు, (ఇన్‌సెట్‌లో) ఇబ్రహీంపట్నంలో జెండా ఊపి సాగనంపుతున్న కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో ప్రజాగళం సభ ఎన్నికల ఉత్సాహాన్ని నింపింది. ఆదివారం మధ్యాహ్నం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగిన ఈ సభకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున మూడు పార్టీల శ్రేణులు తరలివెళ్లాయి. విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్న కేశినేని చిన్ని ఆధ్వర్యంలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేశారు. కేశినేని చిన్ని స్వయంగా మైలవరం నియోజకవర్గ నేతలతో కలిసి ఇబ్రహీంపట్నం వద్ద ప్రజాగళం సభకు ఆటోలు, కార్లు, బస్సుల్లో బయలుదేరిన శ్రేణులను జెండా ఊపి ఉత్సాహపరిచారు. ఆయనతోపాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెనమలూరు నియోజకవర్గం నుంచి ప్రముఖ న్యాయవాది, సీనియర్ టీడీపీ నాయకుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జనసమీకరణ చేశారు. సుమారు 20 బస్సులు, 100 కార్లలో నియోజకవర్గం నుంచి మూడు పార్టీల శ్రేణులు ప్రజాగళం సభకు తరలివెళ్లాయి. వీరిని గొట్టిపాటి రామకృష్ణ జెండా ఊపి సాగనంపారు. గుడివాడ నుంచి 50 బస్సులు, 150 కార్లలో ప్రజాగళం సభకు భారీగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. గుడివాడ టీడీపీ కార్యాలయం వద్ద మూడు పార్టీల నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. గన్నవరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో పెద్దఎత్తున మూడు పార్టీల కార్యకర్తలు ప్రజాగళానికి తరలివెళ్లారు. విజయవాడ పశ్చిమ, విజయవాడ తూర్పు నియోజకవర్గంతోపాటు మచిలీపట్నం, పెడన, తదితర నియోజకవర్గాల నుంచి కూడా పెద్దఎత్తున తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ అభిమానులు ప్రజాగళానికి తరలివెళ్లారు.



పెనమలూరులో న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణుల ర్యాలీ



గుడివాడలో ర్యాలీకి జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

కోడ్ వచ్చినా అధికారులు కదలటం లేదు. అధికార పార్టీ అంటే అచితూచి స్పందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్) బృందాలు పూర్తిస్థాయిలో కోడ్‌ను అమలు చేయలేకపోతున్నాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో కోడ్ అమలుకు చర్యలు తీసుకున్నప్పటికీ.. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించి మాత్రం దృష్టి సారించలేదు.



హనుమాన్‌పేట రోడ్డులో 'సిద్ధం' పోస్టరుతో ప్రచారం

పట్టించుకోడ్!

కోడ్ వచ్చినా సిద్ధం పోస్టర్ల తొలగింపులో ఎంసీసీ విఫలం

- అధికార పార్టీకి నోటీసులు కూడా పంపించని బృందాలు
- వైసీపీ బ్యానర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల తొలగింపు చర్యలు శూన్యం
- బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల అనధికార హోర్డింగ్‌లు ఎక్కడివక్కడే..
- ఫైబర్‌నెట్‌లోనూ అధికార పార్టీ ప్రచారం

నేటి మధ్యాహ్నం 3 గంటల వరకే గడువు



కృష్ణలంకలో జెండా దిమ్మెపై వైసీపీ ప్రచారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బహిరంగ ప్రదేశాల్లో అనుమతిలేని రాజకీయ పార్టీల బ్యానర్లు, హోర్డింగ్‌ల తొలగింపునకు ఎన్నికల సంఘం 48 గంటల సమయం ఇచ్చింది. ఈ పేరుతో ఎంసీసీ బృందం అధికార పార్టీకి సహకారం అందిస్తుస్తోంది. అధికార వైసీపీకి చెందిన సిద్ధం పోస్టర్లు విజయవాడ నగరంతో పాటు, జిల్లా అంతటా ఉన్నాయి. వీటిని ఎక్కడా ఒక్క దానిని కూడా తొలగించలేదు. అదేమని అడిగితే ఇంకా ఒకరోజు సమయం ఉందని ఎంసీసీ అధికారులు అంటున్నారు. ఆదివారం అయినా బహిరంగ ప్రాంతాల్లో, రోడ్ల వెంబడి ఉన్న వైసీపీ సిద్ధం పోస్టర్లను తొలగిస్తారనుకుంటే అదీ చేయలేదు. ఎన్నికల సంఘం ఇచ్చిన 48 గంటల గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగుస్తుంది. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ, అధికార పార్టీకి ఎంసీసీ బృందాలు సహకారం అందిస్తున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో, జంక్షన్ల వెంబడి, రోడ్ల వెంబడి గోడల మీద వాల్ పెయింటింగ్స్ కానీ, వినైల్ బ్యానర్లు, హోర్డింగ్‌లు వంటివి రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి వినియోగించుకోవాలంటే అనుమతి తీసుకుని ఉండాలి. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అనుమతి తప్పనిసరి. సిద్ధం పోస్టర్లను కోడ్‌కు ముందే ఏర్పాటు చేశారు. కాబట్టి ఏ ఒక్కదానికీ అనుమతి లేదు. సిద్ధం పోస్టర్లను తొలగించకుండా ఆ పార్టీ అనుమతులు తెచ్చుకునేందుకు పరోక్షంగా జిల్లా ఎంసీసీ బృందాలు సహకరిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం లోపు అనుమతులు తీసుకునేందుకు సహకరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'మా నమ్మకం నువ్వే' బోర్డులనూ తొలగించలేదు

'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో అధికార పార్టీ వ్యాపార దుకాణాలకు ఉచితంగా బోర్డులను ఇచ్చింది. ఆ బోర్డుల్లో కింద వరుసన ఆ దుకాణం పేరు ముద్రించి ఇచ్చింది. ఈ బోర్డులను అధికార పార్టీతో పాటు, నగరంలోని కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు కూడా స్పాన్సర్ చేస్తూ దుకాణాలకు ఉచితంగా ఇచ్చారు. మా నమ్మకం నువ్వే జగన్ అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులను కూడా ఏ ఒక్క దుకాణంలో కూడా కనీసం తొలగించిన దాఖలాలు లేవు.

పార్టీ దిమ్మెలపై ప్రచారాలు

అధికార పార్టీ ఆఖరికి తమ పార్టీ దిమ్మెలను కూడా ప్రచారానికి వాడుకుంటోంది. వైసీపీ సోషల్ మీడియా విభాగం కనుసన్నల్లో పార్టీ దిమ్మెలకు ఉపయోగించే కడ్డీలపై నవరత్నాలు బిగ్ బ్యాడ్జీలను, పార్టీ కార్యక్రమానికి సంబంధించిన గడపగడపకూ వైసీపీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇవి కూడా రోడ్ల వెంబడి, జనసమ్మర్ద ప్రదేశాల్లోనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు ఎంసీసీ బృందాలు వీటిని తొలగించలేదు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో ఇంకా జగన్ ప్రచారం

ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ ఫైబర్ నెట్ కూడా కోడ్‌ను దారుణంగా ఉల్లంఘిస్తోంది. ఏపీ ఫైబర్ నెట్‌లో ముఖ్యమంత్రి జగన్, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ గౌతం రెడ్డి ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఏపీ ఫైబర్ నెట్ ఉన్న వారు సెట్ టాప్ బాక్స్‌ను ఆన్ చేసిన తర్వాత వచ్చే స్క్రీన్లపై ఇవి దర్శనమిస్తున్నాయి. వీటిని ఇంకా తొలగించలేదు. ఏపీ ఫైబర్ నెట్‌లో అనుమతి లేకుండా ముఖ్యమంత్రి జగన్ స్పీచ్‌తో కూడిన సిద్ధం ట్రైలర్లను ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ జగన్ ఫొటోలు

ప్రభుత్వ వెబ్‌సైట్లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను 24 గంటల్లో తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా అమలు కావటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో ముఖ్యమంత్రి ఫొటోతో పాటు నవరత్నాల లోగోలను కూడా ఇంకా తొలగించలేదు.

'ఆర్టీసీ' ప్రభుభక్తి

- బస్సులపై ప్రభుత్వ పథకాల ప్రచారం

ఎన్నికల కోడ్‌ను ఆర్టీసీ ఉమ్మడి జిల్లాల అధికారులు తుంగలో తొక్కారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎన్నికల అధికారులు దిల్లీరావు, రాజబాబు అన్ని శాఖల ఉన్నతాధికారులకు కోడ్‌ను అమలు చేయాలని నోట్ ఫైల్ పంపారు. అయినా ఆర్టీసీ అధికారులు బేఖాతరు చేశారు. ఆర్టీసీ బస్సులపై వైసీపీ పోస్టర్లు అంటించి ప్రచారం చేస్తోంది. సిటీ బస్సులు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ బస్సులపై ప్రభుత్వ అన్ని రకాల పథకాలను ప్రచారం చేస్తోంది. 'ఇది కాదా అభివృద్ధి?' అంటూ ప్రజలను ప్రశ్నించే విధంగా, ఆలోచింపజేసేలా పోస్టర్లున్నాయి. ఆర్టీసీ బస్సులపై ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచారాన్ని 24 గంటలలోపు నిలుపుదల చేయాలి. లేకపోతే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది.



ఆర్టీసీ బస్సుపై ప్రభుత్వ పథకాల ప్రచారం

పదిలంగా.. రాయాలిక..

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- 151 కేంద్రాలు.. 26507 మంది విద్యార్థులు



పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న ఏపీ డేవిడ్‌రాజు

మచిలీపట్నం టౌన్, మార్చి 17 : జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. విద్యార్థులు పది నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రంలో ఉండాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో 395 ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 26507 మంది విద్యార్థులు 151 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు. 14455 మంది బాలురు, 12052 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 21458 మంది పరీక్షలు రాస్తుండగా, ప్రైవేటు విద్యార్థులు 5049 మంది రాస్తున్నారు. పరీక్షలకు 170 మంది దివ్యాంగులు హాజరవుతున్నారు. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. 151 కేంద్రాలకు డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు.

లీక్ కాకుండా చర్యలు తీసుకున్నాం

టెన్త్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ఇన్విజిలేటర్లు ఎవరూ పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదు. ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా చర్యలు తీసుకున్నాం, లీక్ అయితే క్యూఆర్ కోడ్ ద్వారా తెలిసిపోతుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందు వచ్చి తమకు కేటాయించిన గదిని చూసుకోవాలి.

- తాహెరా సుల్తానా, డీఈవో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (సోమ)
సహర్ (ఉదయం) : 4-53 (మంగళ)



ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కేటాయించిన గదుల లిస్టును చూసుకుంటున్న అభ్యర్థులు

సవ్యంగా గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష

జిల్లాలో ఆదివారం 11 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష సవ్యంగా సాగింది. ఉదయం 5623 మంది అభ్యర్థులకు 2868 మంది పరీక్ష రాశారు. 50.95 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం 5623 మందికిగాను 2852 మంది పరీక్ష రాశారు. 50.72 శాతం హాజరు నమోదైంది. ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. - మచిలీపట్నం టౌన్

పాత ప్లాస్టిక్ గోదాములో భారీ అగ్ని ప్రమాదం

- రూ.50 లక్షలకుపైగా ఆస్తి నష్టం
- ఆకునూరులో ఘటన





ఆకునూరు సమీపాన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన పాత ప్లాస్టిక్ వస్తువుల గోదాములో ఎగసిపడుతున్న మంటలు, అగ్నిప్రమాదంలో దట్టంగా లేస్తున్న పొగ

ఆకునూరు (ఉయ్యూరు), మార్చి 17 : ఉయ్యూరు మండలం ఆకునూరులో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దాదాపుగా రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా. సెలవు రోజు కావడంతో కూలీలు రాలేదు. దీంతో ప్రాణ నష్టం తప్పింది.

ఆకునూరు పంచాయతీ పరిధిలో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డును ఆనుకుని గోదాము ఉంది. కె.శ్రీనివాస్‌కు చెందిన ఈ పాత ప్లాస్టిక్ గోదాములో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ అలముకుంది. కొద్దిసేపట్లోనే మంటలు వ్యాపించాయి. గోదాములోనూ, ప్రాగణం, పక్కన ఉన్న సర్వీసు రోడ్డు వెంబడి పెద్ద గుట్టలుగా ఉన్న పాత ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలకూ మంటలు అంటుకున్నాయి. దీంతో ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. పరిసర ప్రాంతంలో నివసించేవారు భయభ్రాంతులకు గురయ్యారు. గోదాములో బీహార్ నుంచి వచ్చిన 30 మంది కా ర్మికులు, వారితోపాటు కొందరు స్థానిక మహిళలు పనిచేస్తూ ఉంటారు. ఆదివారం కావడంతో ఎవరు పనికి రాలేదు. లోపల ఉన్న కొద్ది మంది బీహార్ కార్మికులు మంటలు చూసి బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం సంభవించినపుడు ఉయ్యూరు అగ్నిమాపక వాహనం గన్నవరంలో విమానాశ్రయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ బందోబస్తులో ఉంది. పామర్రు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపు కాలేదు. పాత ప్లాస్టిక్, రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా తగలబడిపోయాయి. ప్రమాదంలో రూ.50 లక్షలకుపైగా ఆస్తి నష్టం సంభవించినట్టు అంచనా. ప్రమాదానికి కారణం ఇంకా తెలియలేదు. ప్రమాదం సంభవించినప్పుడు తరువాత గోదాము యజమాని అందుబాటులో లేరు. నివాసాల మధ్య గోదాము తొలగించాలని ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.

దుర్గగుడి సేవా కౌంటర్లలో ఈవో తనిఖీలు | ప్రధాని మోదీకి గన్నవరంలో ఘన స్వాగతం.. వీడ్కోలు

- 6లో..

ప్రజాగళం.. ప్రభంజనం


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగ భగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట


ఉత్సాహంగా యువతులు..


బాబు, పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపద నృత్యాలు..


కార్యకర్తల ఉత్సాహం..


మహోత్సాహం

గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

» ఎన్టీఆర్ జిల్లాలో పేపర్-1కు 63.06, పేపర్-2కు 62.66శాతం హాజరు

కృష్ణలంక, మార్చి 17 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడలో 24 కేంద్రాలో 10526 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు చేయగా, ఉదయం జరిగిన పేపర్-1కు 63.06 శాతం (6638), మధ్యాహ్నం పేపర్-2కు 62.66 శాతం (6596) మంది హాజరైనట్టు వెల్లడించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన కో-ఆర్డినేటింగ్, కస్టోడియన్, రూట్, లైజనింగ్ అధికారులు జిల్లాలో వివిధ శాఖల అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్, కో-ఆర్డినేటింగ్ అధికారి పి.సంపత్‌కుమార్ ఆదివారం విజయవాడలోని వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జేసీ


ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చిన బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు

ప్రధాని మోదీకి గన్నవరంలో
ఘన స్వాగతం.. వీడ్కోలు

గన్నవరం, మార్చి 17 : భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీకి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గుంటూరుజిల్లా చిలకలూరిపేటలో జరిగే ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక విమానంలో ఆదివారం సాయంత్రం 4.08 గంటలకు గన్నవరం వచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కొనకళ్ల నారాయణ, యార్లగడ్డ వెంకట్రావు, కంభంపాటి రామ్మోహన రావు, ఎంఎస్ బేగ్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మట్టా ప్రసాద్, చిగురుపాటి కుమారస్వామి, షేక్ బాజీ, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కాపు రామచంద్రారెడ్డి, పోతిన మహేశ్, బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ, చలమలశెట్టి రమేశ్‌బాబు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో చిలకలూరిపేట సభకు 4.15గంటలకు వెళ్లారు.

చిలకలూరిపేట ప్రజాగళం సభను ముగించుకుని ప్రత్యేక హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి ఆదివారం రాత్రి 7.35 గంటలకు ప్రధాని మోదీ చేరుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న, శ్రీరామ్ తాతయ్య, కొలికలపూడి శ్రీనివాసరావు, నల్లబోతు వెంకట్రావు, కృపారావు, దిలీప్, వెంకట రమణారావు శ్రీనివాసులు, భరత్‌కుమార్, రాజాబాబు, శ్రీరామ్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, రాఘవయ్య చౌదరి, గంటసాల వెంకటలక్ష్మి, అక్కల రామ్మోహనరావు, కోటికలపూడి గోవిందరావు, తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని గన్నవరం విమానాశ్రయాన్ని ఎస్పీజీ కమాండర్స్ తమ అధీనంలోకి తీసుకుని బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 400లకు పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

సౌమ్యకు అరుదైన గౌరవం



నందిగామ : నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అరుదైన గౌరవం దక్కింది. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చిలకలూరిపేట బొప్పిడి సభలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పాల్గొన్న వేదికపై ఆమెకు స్థానం దక్కడంతో పాటు టీడీపీ తరఫున ప్రధానికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించే అవకాశం లభించింది. ఇప్పటికే టీడీపీ, జనసేన సమన్వయ కమిటీలో సభ్యురాలిగా ఉన్న ఆమెకు రాజకీయ ప్రాధాన్యత లభించడం పట్ల పార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి
రూ.3 కోట్ల నిధులు

» ఎంపీ బాలశౌరి



అవనిగడ్డ, మార్చి 17 : మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉపాధి అవకాశాలను కల్పించి ఆయా వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఆదివారం ఎంపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఇప్పటికే పార్లమెంటరీ నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని, నాబార్డు ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్టు కింద చైర్మన్ కేవీ షాజితో మాట్లాడి అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో ఉన్న దాదాపు 500 కుటుంబాలకు లబ్ధి చేకూరేలా రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించినట్టు ఎంపీ తెలిపారు. ఆయా వర్గాల అభ్యున్నతికి నిధులు ఉపయోగపడతాయని బాలశౌరి తెలిపారు. మొత్తం 500 యానాది కుటుంబాల్లో 150 కుటుంబాలకు 30 చిన్న చిన్న బోట్లు, 30 వలలు అందజేస్తామని, మరో 150 కుటుంబాలకు చేపలు పట్టే 30 కేజ్‌లు అందిస్తామని, 30 కుటుంబాలకు ఆక్వా కల్చర్‌కు అనువుగా ఉన్న భూములను చెరువులుగా మార్చి ఇవ్వనున్నట్టు తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు 20 కుటుంబాలను కలిపి చేపల ఫీడ్ తయారు చేసే మిషనరీని కొనుగోలు చేసి వారికి అందిస్తామని, 40 కుటుంబాలకు రొయ్యలు, పీతల సీడ్ పెంచేలా రైతులను ప్రోత్సహిస్తామని బాలశౌరి తెలిపారు. యానాదుల కుటుంబాలకు ప్రతీ ఆరు నెలలకొకసారి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని, రెండు మండలాల్లోని ఐదు గ్రామాల్లో శుద్ధి చేసిన నీటిని అందించేందుకు నీళ్ల ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తామని ఎంపీ బాలశౌరి ప్రకటనలో తెలిపారు.

దుర్గగుడి సేవా కౌంటర్లలో ఈవో తనిఖీలు

వన్‌టౌన్, మార్చి 17 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆర్జిత సేవా, విరాళాల కౌంటర్, టోల్‌ఫ్రీ, దర్శనం కౌంటర్లను ఆదివారం సాయంత్రం ఈవో కేఎస్ రామారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవల కౌంటర్‌లో వివిధ పూజల టికెట్‌లు ఏ మేరకు జరుగుతున్నాయి, విరాళాల కౌంటర్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని సిబ్బందిని ఈవో అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఈవో రామారావు

అధికారులతో చైర్మన్ వాగ్వివాదం

దేవస్థానం అధికారులతో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆదివారం వాగ్వాదానికి దిగారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఈ క్రమంలో దేవస్థానం అధికారులు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కార్యాలయానికి శనివారం రాత్రి తాళంవేసి అందులో పనిచేస్తున్న సిబ్బందిని అంతర్గత బదిలీచేశారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన చైర్మన్ కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని గమనించి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. దేవస్థాన అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరి అని గతంలో కూడా ఎన్నికల కోడ్ అమలు పరిచామని చెప్పడంతో చైర్మన్ వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ వ్యవహారాన్ని ఈవో దృష్టికి తీసుకువెళ్లగా ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని చెప్పడంతో చైర్మన్ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బీఎస్పీ తొలి జాబితా విడుదల

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 17 : వచ్చే ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి తెలిపారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల తొలి జాబితా విడుదల చేశారు. 25 పార్లమెంట్ స్థానాలకు 11 మంది, 175 అసెంబ్లీ స్థానాలకు 50 మంది అభ్యర్థుల పేర్లను తెలిపారు. త్వరలో మిగతా స్థానాలు ప్రకటిస్తామన్నారు. పార్టీ కన్వీనర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీలకు చెందిన సీట్లను వైసీపీ రెడ్డి కులానికి కేటాయించిందన్నారు. బీసీలు తమ పార్టీలో కలిస్తే సీట్లు కేటాయిస్తామని కోరారు.

నేడు స్పందన నిలుపుదల

మచిలీపట్నం టౌన్/కృష్ణలంక మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున సోమవారం కలెక్టరేట్‌లలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం తాత్కాలికంగా నిలుపుదల చేశామని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు రాజాబాబు, ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న సోమవారం నిర్వహించే స్పందన రద్దు చేసినట్టు చెప్పారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అములులో ఉందన్నారు.

దళిత డిక్లరేషన్ మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

» దళిత, ప్రజాసంఘాలు

ధర్నాచౌక్, మార్చి 17 : రాజ్యాంగ పరిరక్షణ, దళితుల ఆత్మగౌరవం కోసం సామాజిక న్యాయం, దళిత సమస్యలపై దళిత డిక్లరేషన్ అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పెట్టాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన దళిత, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై నిత్యం దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన ఘటన దేశాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు సైతం ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాల కేసులను విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తీర్మానించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అండ్ర మల్యాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు, పౌరహక్కుల నేత పిచ్చుక శ్రీనివాస్, జాతీయ రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్ నేత గుటాల పాపారావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేత జి.స్వరూపదత్, వ్యవసాయ సంఘం నేత దడాల సుబ్బారావు, గోళ్ల నారాయణరావు, వివిధ సంఘాల నేతలు గంజి రామారావు, సంగుల పేరయ్య, మంతెన సీతారాం, కారుమంచి రామారావు, జి.నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాసేవ చేసేందుకు
రాజకీయాల్లోకి వచ్చా

» బందరు వైసీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్



పామర్రు, మార్చి 17 : నిజాయితీగా ప్రజలకు సేవలందించేందుకు వైద్య వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని బందరు వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో తాజామాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి దివంగత సింహాద్రి సత్యనారాయణ టీడీపీ హయంలో దేవదాయ శాఖ మంత్రిగా సేవలందించి ప్రజల్లో పేరు తెచ్చుకున్నారన్నారు. జగన్ ఆదేశాల మేరకు తాను బందరు పార్లమెంట్ అభ్యర్థిగా నిస్వార్థంగా ప్రజలందరికీ మెరుగైన సేవలందిస్తానని హామీ ఇస్తున్నానన్నారు. కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో మిగిలి ఉన్న అభివృద్ధిని రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

వాహన తనిఖీల్లో
రూ.40 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, మార్చి 17 : అంతరాష్ట్ర చెక్ పోస్టు గరికపాడు వద్ద నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా ఆదివారం ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.40 లక్షల నగదుతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న అమరావతి బస్సులో తనిఖీలు చేయగా అనుమానాస్పదంగా ఉన్న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ధనుంజయ, విజయనగరం జిల్లా కోన గ్రామానికి చెందిన వెంకటేశ్ బ్యాగులు తనిఖీ చేయగా నగదు గుర్తించి వారిని చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.


బొప్పరాజును సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సభ్యులు

కృతజ్ఞతా సత్కారం

కృష్ణలంక, మార్చి 17 : గ్రేడ్-2 వీఆర్‌వోలకు ఒక సంవత్సరం కండిషనల్ ప్రొబిషన్ డిక్లరేషన్ మెమోకు విశేష కృషి చేసిన ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, మాజీ ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తిలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సభ్యులు ఆదివారం వేదపండితుల సమక్షంలో విజయవాడ రెవెన్యూభవన్‌లో టీటీడీ తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు. 935 మంది గ్రేడ్-2 వీఆర్‌వోల జీవితాలలో వెలుగు నింపిన ఏపీఆర్ఎస్ఏకు రుణపడి వుంటామని వీఆర్‌వోలు తెలిపారు. అభినందన సభకు గుంటూరు జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షులు పీఏ కిరణ్‌కుమార్, ఏపీ వీఆర్ఏల రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, అర్లయ్య, శంకరరావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కంకిపాడు, మార్చి 17 : షార్ట్ సర్క్యూట్ కారణంగా నష్ట పోయిన బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా లాకు రోడ్డులోని బండారు అప్పారావు ఇంటికి నిప్పంటుకొని పూర్తిగా నష్టపోయారు. సమాచారం అందుకున్న వెంకట్రామ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చలవాది రాజా, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, గోగినేని వెంకట రమణ, ఏనుగ జయప్రకాష్, నాంచారయ్య పాల్గొన్నారు.

నాడు-నేడుకు మంగళం!

- మొండిగోడలు, పిల్లర్లతో దర్శనమిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు
- ఇరుకు గదుల్లోనే విద్యా సంవత్సరం
- ప్రచార ఆర్భాటమే.. పనులు శూన్యం
- మండల వ్యాప్తంగా ఫేజ్2లో 26 పాఠశాలకు రెండు మాత్రమే పూర్తి
- బిల్డింగ్ మెటీరియల్స్, గుంటలతో ప్రమాదకరంగా పాఠశాల ఆవరణ
- పనుల పూర్తిపై అధికారుల్లో అయోమయం



కానుమోలు హైస్కూల్‌లో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 17 : పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పనులు మందకొడిగా సాగి నిధుల కొరతతో మధ్యలోనే ఆగిపోవడంతో అటు ఉపాధ్యాయులకు, ఇటు విద్యార్థులకు అసహనాన్ని కలిగిస్తున్నాయి. పాఠశా లలు తెరిచేనాటికే సిద్ధంగా ఉండాల్సిన తరగతి గదులు, ఏడాది పూర్తయినా ఇరుకుగదుల్లోనే బోధన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నేటితో ప్రారంభం కానున్నా ఇంతవరకూ నాడు-నేడు పనులకు అతీగ తీలేదు. పాఠశాలల ఆవరణల్లో బిల్డింగ్ మెటీరియల్, పనులు చేస్తున్న వారితో విద్యార్థులు చదుకునేందుకు చోటుసరిగా లేకపోగా తవ్విన గోతులు, ఐరన్, సిమెంట్ బస్తాలు తదితరాలతో ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇరుకు గదుల్లో అరకొర సదు పాయాలతో ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులు పూర్తి చేసి పరీక్షలకు సమాయత్తమవుతున్నా మొం డిగోడలు, పిల్లర్లతో హైస్కూళ్లు దర్శనమిస్తున్నాయి. నాడు- నేడు పనులు సగంలో ఆగిపోయిన హైస్కూళ్లలోనే (వేలేరు, వీరవల్లి, కానుమోలు) 10వ తరగతి పరీక్షా కేంద్రాలు కావడం గమనార్హం. బాపులపాడు మండల వ్యాప్తంగా 26 స్కూళ్లు నాడు-నేడు పనులు మొదలవ్వగా ఆరుగొలను, కొత్తపల్లిలో రెండు పాఠశాలలు మాత్రమే పనులు పూర్తయ్యాయి. వీరవల్లి హైస్కూల్ ఆవరణ కంకర, ఇసుక, మట్టి దిబ్బలతో నిండిపోయింది. నాడు-నేడు పనులు ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

బాపులపాడు మండలంలో 26 స్కూళ్లు నాడునేడు కింద తరగతిగదులు, ఇతర అభివృద్ధి పనులకు రూ.12.68కోట్లు మంజూరు చేశారు. అవి కాగితాలకే పరిమితమవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. అధికారిక గణాంకాల ప్రకారం సుమారు 4.6కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, వాటి వరకే పనులు పూర్తి చేశారని తెలిపారు. నిధుల లభ్యత లేని కారణంగా, అధికార పార్టీ వారే కాంట్రాక్టర్ల అవడంతో ఒత్తిడి చేయలేక పోతున్నారు. స్విచ్‌బోర్డులతో సహా మెటీరియల్ మొత్తం ప్రభుత్వం నుంచే రావాలని, సయమానికి మెటీరియల్ అందక పోవడం వల్ల తాము పనిచేయలేదని కాంట్రాక్టర్ల వాదన. సమస్య ఎవరిదైనా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

నిధులు లేక నిలిచిపోయిన పనులు

కోట్లాది రూపాయల ఖర్చుతో నాడు-నేడు పనులు మొదలు పెట్టామని ప్రచారార్భాటం చేసుకునే వైసీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం చతికిలపడిందనేది కంటికి కనబడే వాస్తవం. నాడు-నేడు పథకం మొదలై సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకూ పనులు పూర్తి కాకపోవడమే సజీవతార్కాణం.



పిల్లర్లస్థాయిలోనే నిలిచిపోయిన పాఠశాల నిర్మాణ పనులు

బాడీబిల్డింగ్ పోటీల్లో బాలకృష్ణకు గోల్డ్‌మెడల్

పెనమలూరు, మార్చి 17 : పంజాబ్‌లోని లూధియానాలో శని, ఆదివారాల్లో జరిగిన జాతీయస్థాయి సీనియర్ మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన బాలకృష్ణ (రైల్వే బోర్డు) 55 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు కానూరు అశోక్ జిమ్ నిర్వాహకుడు అశోక్ తెలిపారు. విజేతను రాష్ట్ర టీఏటీపీఏ అధ్యక్షుడు స్వామి రమేష్, కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, ఈదా రాజేష్, మనోహర్, వైష్ణవి నరేంద్ర, సీహెచ్ రాజు, కోటి అభినందించారు.

అనుభవాలే జీవిత పాఠాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 17 : జీవితంలో నేర్చుకునే అను భవాలతో కూడిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతశిఖరాలు అధిరోహించవచ్చని ఈడాక్ ప్రతినిధి అభిశాంత్ అన్నారు. సీతారాంపురంలోని సచివాలయ ప్రాగణంలో ఈడాక్ ఆధ్వ ర్యంలో సిద్ధార్థ విద్యాలయ సహకారంతో ది జర్నీ ఆఫ్ లెర్నింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సమాజంలో మంచి, చెడులను స్వతంత్రంగా విశ్లేషించుకుని ముందుకు సాగేలా పిల్లలకు తర్ఫీదు నివ్వాలన్నారు. ప్రస్తుత సమాజంలో స్పాట్ డెసిషన్ (అక్కడిక్కడే నిర్ణయం) ప్రాధాన్యత గురించి వివరిస్తూ మంచి నిర్ణయాలతో మంచి భవిష్యత్తు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాలయ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఇన్‌చార్జి శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హడావిడిగా రోడ్డు అభివృద్ధి పనులు

అడ్డుకున్న గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 17 : ఎన్నికల నిబంధనలు అమలు చేస్తూ ప్రజాస్వామ్యయుతంగా బాధ్యతతో విధులు నిర్వహించాల్సిన గ్రామస్థాయి అధికారులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారని సింగన్నగూడెం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగన్నగూడెంలో అంతర్గత రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులను స్థానిక వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఆదివారం హడావిడిగా ప్రారంభించారు. ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు పంచాయతీ కార్యదర్శి అలా కళ్యాణికి ఫిర్యాదు చేశాడు. పనులు ఆపకపోగా, అక్కడికి వచ్చిన కొందరు వైసీపీ నేతలు గ్రామాభివృద్ధిని అడ్డుకుంటారా అంటూ దుర్భాషలాడుతూ కృష్ణారావుపై దౌర్జన్యం చేశారు. సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న కళ్యాణి అధికారపార్టీకి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలతో ఈనెల 13న బదిలీ అయ్యారు. శనివారం తిరిగి మళ్లీ అదే పంచాయతీకి పదోన్నతిపై కార్యదర్శిగా వచ్చారు. ఇదే అదునుగా భావించిన వైసీపీ నాయకులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ పనులు ప్రారంభించారు. కార్యదర్శి కళ్యాణి సహకారంతోనే సీసీ రోడ్డు పనులు ప్రారంభించారని సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పునులూరి లక్ష్మీనారాయణ గన్నవరం ఎన్నికల అధికారి గీతాంజలిశర్మ దృష్టికి తీసుకువెళ్లారు. ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యను సవి వరంగా తెలియజేయాలని ఎంపీడీవో రత్నకుమారికి ఆదేశాలు జారీ చేశారు.

సకలేశ్వరస్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవం



తోట్లవల్లూరు, మార్చి 17 : రొయ్యూరు గంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. వేలాదిమంది భక్తులు ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్నారు. నూతన దేవస్థానాన్ని నిర్మించి శివలింగం, పార్వతీదేవి, గణపతి, వీరభద్రస్వామి, నందీశ్వరుడు, ద్వారపాలకుడు, నవగ్రహాలు, జీవధ్వజం, ఆలయ శిఖరాలు, బలిపీఠం, నాగబంధ విగ్రహాల ప్రతిష్ఠ వేదపండితులు నిర్వహించారు. భారీ అన్నదానం జరిగింది. నూతన కమిటీ చైర్మన్ మోర్ల రామచంద్రరావు, సభ్యులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలి

గుడివాడ రూరల్, మార్చి 17 : గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంపు కార్యాలయాన్ని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆంజనేయరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనుచరులు పనులు చేస్తున్నారని, విలువైన ఫర్నీచర్ ఉందని, తక్షణమే స్వాధీనం చేసుకుని తాళాలు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు లింగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్డీవో పద్మావతికి తెలియజేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు



కంకిపాడు నుంచి ప్రజాగళం సభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు, గోసాల నుంచి.. రేమల్లె నుంచి..

ప్రజాగళంతో పార్టీ శ్రేణుల్లో జోష్

టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో భారీగా తరలిన కార్యకర్తలు



ప్రజాగళం సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులతో బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 17 : చిలకలూరిపేటలో ఆదివారం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిర్వహించిన ప్రజాగళం భారీ బహిరంగ సభకు పెనమలూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ నాయకత్వంలో సుమారు ఏభై కార్లు, బస్సులలో అభిమానులు సభకు వెళ్లారు. పొత్తు కుదిరిన తర్వాత మొదటి సభ కావడం, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత తొలి బహిరంగ సభ కావడంతో టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా వెళ్లారు. సభకు వెళుతున్న తెలుగుతమ్ముళ్లకు బోడె ప్రసాద్ జెండా ఊపి సాగనంపారు.

సభకు తరలివెళ్లిన జనసైనికులు

చిలకలూరిపేట ప్రజాగళం సభకు పెనమలూరు నియోజకవర్గం నుంచి జనసైనికులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తాడిగడప మునిసిపాలిటీ జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్, ముప్పా రాజా, వడ్డి జీవాల ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో వాహనాల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. కానూరు జనసేన కార్యాలయం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలకు తాతపూడి గణేష్ జెండా ఊపి పంపించారు.

అధికార పార్టీపై యుద్ధమే..

కంకిపాడు : ప్రజా సమస్యలపై మూడు పార్టీలు చేపట్టిన ప్రజాగళం అధికారపార్టీపై యుద్ధం ప్రకటించటమే అని తెలుగుదేశం పార్టీ నాయకులు, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు కంకిపాడు నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 10 బస్సులు, 60 కార్లలో భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన పార్టీ నాయకులు బండి నాంచారయ్య, కొప్పరాజు సురేష్, విజయ్, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

● పెనమలూరు మండలంలోని గోసాల తెలుగు దేశం పార్టీ నాయకులు ఏందువ రాంబాబు ఆధ్వర్యంలో చిలకలూరి పేటలో నిర్వహించిన ప్రజాగళం మహాసభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పార్టీ అధ్యక్షులు సుబాని, ఆంజనేయులు, కోనేరు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ప్రజాగళం మహాసభకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెనమ లూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బోయిన నాగరాజు, సుంకర శివ, పిచుక రవి, సుంకర సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్రాభివృద్ధితో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందాలన్నా, ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మగౌరవం పెరగాలన్నా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు యనమదల సుధాకర్‌రావు అన్నారు. రేమల్లె నుంచి 60 మందికిపైగా తెలుగు తమ్ముళ్లు, నాయకులు ఆదివారం బొప్పూడిలో జరుగుతున్న ప్రజాగళం సభకు బస్సులు, కార్లలో తరలి వెళ్లారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, కార్యదర్శి విజయనంద్, ఉప సర్పంచ్ సుద ర్శనరావు, వడ్లపూడి మూర్తి, తుమ్మల మధు, చల్లగుళ్ల గణేష్, పాండురంగరావు, సాంబయ్య, వడ్లపట్ల రాం బాబు, బెజవాడ శివయ్య, కలపాల కుమార్, చంద్రకాంత్ తదితరులు ర్యాలీగా తరలివెళ్లారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు

గన్నవరం, మార్చి 17: కేంద్రంలోని బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని, దానిని ఓడించటమే లక్ష్యంగా లౌకికశక్తులు, ప్రజా స్వామ్యవాదులు కదులుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో ఆదివారం సీపీఎం డివిజన్‌స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దేశాన్ని సర్వ నాశనం చేయటంలో బీజేపీకి ప్రత్యేకత ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడంలో మోదీ ముందున్నారని ధ్వజమెత్తారు. అదాని అంబానీలకు విమానాశ్రయాలు, టెలికాం సంస్థల ను అప్పగిం చారని, కొత్త ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మూడు సార్లు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అసెంబ్లీగా అడుగు పెట్టి గన్నవ ~నికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ, నియోజ కవర్గంలో సీపీఎం బలమైన శక్తిగా ఎదగడానికి పార్టీ నాయకత్వం కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఎం తరుపున అభ్యర్థి బరిలో ఉంటారని తెలిపారు. సీపీఎం నాయకులు ఆర్.రఘు, ఎం.హరిబాబు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, కళ్ళం వెంకటేశ్వరరావు, బేతా శ్రీనివాసరావు, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, గన్నే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కుటుంబాలతో యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ చేసిన అభివృద్ధి వైపే ప్రజలు

యార్లగడ్డ సమక్షంలో 25 కుటుంబాలు టీడీపీలో చేరిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 17 : టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వైపునకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పెరికీడుకు చెందిన 25 కుటుంబాలు టీడీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు సింగవరపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం టీడీపీలో చేరారు. పెరికీడుకు చెందిన లగుడ అప్పారావు, దమ్ముడపు శ్రీనివాసరావు, బాసిన భద్రమ్మ, కాకర్లపూడి సీతారామరాజు, సత్యమ్మలతో పాటు 25 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. యార్లగడ్డ వెంకట్రావు వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సీఏఏ అమలు ప్రమాదకరం


సీఐటీయూ నాయకులు

గుడివాడ : సీఏఏ అమలు దేశానికి ప్రమాద కరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సిపి రెడ్డి అన్నారు. సుందరయ్యభవన్‌లో కేంద్ర ప్రభు త్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, సీఏఏ అమలు జరిగితే జరిగే పర్యవసానాలు ఎలా ఉంటాయో వివరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఆర్‌జేసీ ఆజాద్



మోపిదేవి, మార్చి 17 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక బృందం వారిని శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం స్వర్ణోత్సవంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

● జిల్లా ఆర్యవైశ్య సంఘ స్వర్ణోత్సవంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 17 : సత్రాలకు, పేదలకు ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలు అభినం దనీయమని మాజీ మంత్రి, ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గోల్డ్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘ స్వర్ణోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, టీజీ వెంకటేష్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అమర జీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సన్నిధి నాగసాయి శ్రీనివాస్, పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు చక్కా చెన్నకేశవరావు, జి.వి.గున్నయ్యశెట్టి, పెనుగొండ సుబ్బారాయుడు, మోటమర్రి బాబాప్రసాద్, రామ చంద్రరావు, మద్దుల గిరీష్ కుమార్, తాడేపల్లి మెహర్‌బాబా, రజని, పరిశ వాణిశ్రీ, మల్లికార్జున గుప్తా, పద్మనాభుని శేఖర్, యెండూరు సురేష్, పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, దింటకుర్తి సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలి

గుడివాడ రూరల్, మార్చి 17 : గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంపు కార్యాలయాన్ని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆంజనేయరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనుచరులు పనులు చేస్తున్నారని, విలువైన ఫర్నీచర్ ఉందని, తక్షణమే స్వాధీనం చేసుకుని తాళాలు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు లింగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్డీవో పద్మావతికి తెలియజేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

సకలేశ్వరస్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవం

తోట్లవల్లూరు, మార్చి 17 : రొయ్యూరు గంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామి దేవస్థానం పునః ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. వేలాది మంది భక్తులు ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్నారు. నూతన దేవస్థానాన్ని నిర్మించి శివలింగం, పార్వతీదేవి, గణపతి, వీరభద్రస్వామి, నందీశ్వరుడు, ద్వారపాలకుడు, నవగ్రహాలు, జీవధ్వజం, ఆలయ శిఖరాలు, బలిపీఠం, నాగబంధ విగ్రహాల ప్రతిష్ఠ వేదపండితులు నిర్వహించారు. భారీ అన్నదానం జరిగింది. నూతన కమిటీ చైర్మన్ మోర్ల రామచంద్రరావు, సభ్యులు పర్యవేక్షించారు.



లంకమ్మకు ఆర్యవైశ్య మహిళల సారె

అవనిగడ్డ, మార్చి 17 : దివి ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారికి మండల ఆర్యవైశ్య మహిళలు ఆదివారం సారె సమర్పించారు. అవనిగడ్డ వంతెన సెంటర్ నుంచి లంకమ్మ అమ్మవారి ప్రతిమలను చేతపట్టుకుని నగర సంకీర్తన చేస్తూ మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. రహదారి పొడవునా గ్రామస్థులు వారపోస్తూ స్వాగతం పలికారు. నగర సంకీర్తన అనంతరం అమ్మవారికి చీర, సారెలు సమర్పించి లోకకల్యాణం కోసం పూజలు నిర్వహించారు.



గ్రామాల్లో పిన్నమనేని ట్రస్టు వైద్యసేవలు

నందివాడ (పోలుకొండ), మార్చి 17 : పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషనల్, మెడికల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుట్టగుంట, తుమ్మలపల్లి, వెన్ననపూడి, ఇలపర్రు, తమిరిశ, పోలుకొండ గ్రామాల్లో ఉచిత మెగా వైద్యశిబిరాల ద్వారా వేలాది మందికి వైద్య సేవలు అందించినట్లు పిన్నమనేని ట్రస్టు సభ్యులు తెలిపారు. పోలుకొండలో నిర్వహించిన వైద్య శిబిరానికి కె.వి.చౌదరి, పున్నమ్మ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు కె.వి.చౌదరి మాట్లాడుతూ ట్రస్టు సేవలను అభినందించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్లు పిన్నమనేని రామకృష్ణ ప్రసాద్, మాధవి, వంశీకృష్ణ, ఎల్.అమరచౌదరి, యు.సురేష్ బాబు, కె.శ్రావణి ఉచితంగా వైద్య సేవలు అందించటం సంతోషకరమన్నారు. అనంతరం డాక్టర్లను సత్కరించారు. పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జీ), మోకా తిరుపతి రాయుడు, బొర్రా సత్యనారాయణ, పర్వతనేని రాజబాబు, అరెకపూడి రామశాస్త్రి, తమరెడ్డి శ్రీనివాసరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు మానేపల్లి ఝాన్సీ కుమారి, కైలే సుబ్బారావు, కృష్ణయ్య స్వామి, శ్రీనివాసరావు, నున్న చిట్టిబాబు, కర్రాగొర్రెలు, పాలడుగు నానారావు, పాల్గొన్నారు.



డాక్టర్లను సత్కరిస్తున్న పిన్నమనేని ట్రస్టు ప్రతినిధులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఏఎన్నార్ కళాశాల 1972-77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఏఎన్నార్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడివాడ : అక్కినేని నాగేశ్వరరావు కళాశాల 1972-77 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంల ఆదివార సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట వెంకటశాస్త్రి బ్రాహ్మణ ధర్మసత్రం వేదికగా జరిగింది. మిత్రమా స్వాగతం సంస్థ అధ్యక్షుడు మల్లెల మల్లిఖార్జునరావు, ముఖ్య కార్యదర్శి కె.వి.ఎస్.ఎన్ మూర్తి, తోట నరేంద్ర దేవ్, వెన్నా వల్లభరావు, ఆకుల మల్లేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో సమ్మేళనం ఘనంగా జరిగింది. 52 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన సహచరులు, విద్యాబోధన చేసిన గురువుల రాకతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళకళలాడింది. మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో అపూర్వ కలయికకు వన్నె తెచ్చారు. ప్రతి ఏడాది ఏదో ఒక సందర్భంలోనైనా అందరూ కలవాలి అనే ఆలోచన ప్రతి ఒక్కరి మనస్సుల్లోనూ మెదిలింది. విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

వేకనూరులో సూర్యనారాయణ స్వామి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : వేకనూరులో సూర్యనారాయణ స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు బ్రహ్మత్వంలో యడమా నాగరాజు - దేవి ప్రియ దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం జరిపించారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష అలంకరణ చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.







కొట్టి వెంకట్రావు నేతృత్వంలో కార్ల రాలీ... జెండా ఊపుతున్న చిన్నాపురం సర్పంచ్ కాగిత | కోడూరు నుంచి చిలకలూరిపేట వెళ్తున్న పార్టీ శ్రేణులు | కూచిపూడి నుంచి ప్రజాగళం సభకు తరలివెళ్తున్న మహిళలు

ప్రజాగళం సభకు భారీ ర్యాలీలు

మచిలీపట్నం టౌన్, మార్చి 17 : చిలకలూరిపేట ప్రజాగళం సభకు మచిలీపట్నం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆదివారం తరలివెళ్లారు. మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నాయకులు కొట్టి వెంకట్రావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, పెదయాదర గ్రామ సర్పంచ్ గల్లా తిమోతి, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర తదితరులు పెద్దసంఖ్యలో తమ అనుచరులతో తరలివెళ్లారు. దాదాపు వంద వాహనాల్లో మచిలీపట్నం, రూరల్ మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలివెళ్లారు. **గుడివాడ :** రానున్న ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజావేదిక వద్ద నుండి చిలకలూరిపేట ప్రజాగళం సభకు బయలుదేరిన 50 బస్సులు, 150 కార్ల ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. భారీగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. చిలకలూరిపేట ప్రజాగళం సభకు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి నేతృత్వంలో సభ్యులు భారీగా తరలివెళ్లారు. **గుడివాడ రూరల్ :** బిళ్లపాడు, రామన్నపూడి, చిన ఎరుకపాడు తదితర గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రజాగళం సభకు తరలి వెళ్లారు. **నందివాడ :** చిలకలూరిపేట ప్రజాగళం బహిరంగ సభకు నందివాడ మండల టీడీపీ నాయకులు భారీగా వెళ్లినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసరావు తెలిపారు. **బంటుమిల్లి :** టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభకు ఆదివారం భారీ స్థాయిలో తరలి వెళ్లారు. పెడన నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నేతృత్వంలో మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో 16 బస్సులు, పదుల సంఖ్యలో కార్లలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు. **అవనిగడ్డ :** ప్రజాగళం బహిరంగసభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు తరలివెళ్లాయి. అవనిగడ్డలోని టీడీపీ కార్యాలయం వద్ద నుంచి దాదాపు 100 కార్లలో పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లాయి. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి రామ్మోహనరావు, జనసేన నేతలు గుడివాక శేషుబాబు, రాయపూడి వేణుగోపాలరావు, బొప్పన భాను తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ - పెనుమూడి వారధి మీదుగా జనసేన నాయకులు చిలకలూరిపేట ప్రజాగళం బహిరంగ సభకు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. **కోడూరు :** చిలకలూరిపేట ప్రజాగళం బహిరంగ సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీగా తరలి వెళ్లారు. పిల్లి మల్లిఖార్జునరావు, కొప్పనాతి సత్యనారాయణ, ఉల్లి శేషగిరిరావు, పాలడుగు ఆనందరావు, బడే గాంధీ, బడే వీరబాబు, బొలిశెట్టి విఠల్ రావు, కాగిత రామారావు, ఉప్పాల పోతురాజు, కోట రాంబాబు, తోట దామోదర్, బండే అంజనేయులు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **కూచిపూడి :** గుంటూరు జిల్లా చిలకలూరిపేట సమీపంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాగళం భారీ బహిరంగ సభకు మొవ్వ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. కూచిపూడి, పెదపూడి, మొవ్వ, నిడుమోలు తదితర గ్రామాల నుంచి మహిళలు, యువకులు తరలివెళ్లారు. **తోట్లవల్లూరు :** ప్రజాగళం సభ కు మండలం నుంచి టీడీపీ, జనసేన నాయకులు భారీగా తరలి వెళ్లారు. 16 గ్రామాల నుంచి ప్రైవేటు స్కూల్ బస్సుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. **పమిడిముక్కల :** ప్రజాగళం సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు ఆదివారం తరలి వెళ్లాయి. రెండు పార్టీలకు చెందిన నాయకులు నినాదాలు చేస్తూ బస్సులలో తరలి వెళ్లారు.



నందివాడ నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



బంటుమిల్లి మండలం అర్తమూరు నుంచి భారీగా తరలివెళ్తున్న కార్యకర్తలు

అన్ని రాజకీయ పార్టీలు అనుమతి పొందాలి

● పూర్తి వివరాలు ఇవ్వాలి : ఆర్డీవో

మచిలీపట్నం టౌన్, మార్చి 17 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ప్రకటనలు ప్రదర్శించేందుకు విధిగా అనుమతి పొందాలని రిటర్నింగ్ ఆఫీసర్, బందరు ఆర్డీవో ఎం. వాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రకటన వివరం, ప్రకటన వేయు స్థలం, ప్రకటనల సంఖ్య వివరాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు తెలియజేసి అనుమతి పొం దాలన్నారు. ఇంతకుముందు ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులను వెంటనే తొలగించాలన్నారు. తొలగించేందుకు అయ్యే ఖర్చులు రాజకీయ పార్టీలే భరించాలన్నారు. ప్రకటనల బోర్డుల్లో ఎదుటివారి గౌరవాన్ని భంగం కలిగించే విధంగా ఉండకూడదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థుల ప్రచార వాహనాలకు ముందుగా అనుమతి పొందాలన్నారు. ఎన్నికల బహిరంగ సభలు నిర్వహించేందుకు అనుమతులు పొందాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వరకు ఎటువంటి రాజకీయ ప్రదర్శనల బోర్డులు ప్రదర్శించకూడదన్నారు.

బాలుర వసతి గృహానికి రూ.50 వేల విరాళం

మచిలీపట్నం టౌన్ : నోబుల్ కాలనీలోని కెఎన్‌హెచ్ బాలుర హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కోసం మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.50వేలు విరాళం అందజేశారు. రెండేళ్లుగా 300కు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన మైత్రీ ఫౌండేషన్ హాస్టల్‌లోని పేద విద్యార్థులు, వృద్ధుల అవస రాలకు ఈ విరాళం అందజేసింది. మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు పి వేణుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరప్రసాద్, రాధాకృష్ణ, శ్రవణం శివ, రిటైర్డు డీవైఈవో విజయ లక్ష్మి, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, నోబుల్ మిషనరీస్ కార్యదర్శి మణిలాల్, ప్రేమానందం, భవాని పాల్గొన్నారు.



సీఏఏ అమలు ప్రమాదకరం : సీఐటీయూ

గుడివాడ : సీఏఏ అమలు దేశానికి ప్రమాదకరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి అన్నారు. సుందరయ్యభవన్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, సీఏఏ అమలు జరిగితే జరిగే పర్యవసానాలు ఎలా ఉంటాయో వివరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

అవనిగడ్డ రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాలని పులిగడ్డ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ విజ్ఞప్తి చేశారు. గురుకుల విద్యాలయంలో సోమవారం టెన్త్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురుకుల విద్యాలయంలో ప్రతి ఏటా నూటికి నూరుశాతం ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, పీఈటీ జి.వీరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి ముమ్మనేని నాని రూ.50వేల విరాళం

చల్లపల్లి : నిమ్మల తోటలోని సీయోను వృద్ధాశ్రమ నిర్మాణానికి చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆశ్రమ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన విరాళాన్ని నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందజేశారు. నాని కుమారుడు అనిల్ వంశీ, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామ రాజు, వేముల హరికృష్ణ, బుల్లా కిషోర్ పాల్గొన్నారు.



ఇరిగేషన్ క్రెడిట్ సొసైటీ కార్యవర్గం

అవనిగడ్డ రూరల్ : దివి ఇరిగేషన్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా పొనుగుమాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.వెంకట రమేష్, డైరెక్టర్లుగా కొల్లిపర శ్రీనివాసరావు, పెనుమూడి నాగేశ్వరరావు, వీర్నాల నాగేశ్వరరావు, చాపల వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు.



వైభవంగా శివ నాగేంద్రస్వామి ఉత్సవం

చల్లపల్లి : నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంలో శివ నాగేంద్రస్వామి ఆలయ 36వ వార్షిక ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి జంపాన బాబూరావు స్వామి ఆధ్వర్యంలో ఉత్సవ జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధన జరిగింది.

వరాహాల పట్టివేత

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో వరాహాలు గుంపులుగా తిరుగుతూ ఇటీవల చిన్నారిపై దాడి చేసిన విషయం విదితమే. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు ఆదివారం రాత్రి పదికి పైగా వరాహాలను బంధించారు. వాటిని దూరంగా అడవుల్లో విడిచి పెటనున్నామని పంచాయితీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. వరాహాల పెంపకం దారులు గ్రామంలో వాటిని వదిలితే పట్టించి అడవుల్లో వదులుతామని కార్యదర్శి హెచ్చరించారు.

అవనిగడ్డ టికెట్ బీసీలకు ఇవ్వాలి

అవనిగడ్డ : అవనిగడ్డ అసెంబ్లీ స్థానం నుంచి వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆదివారం అవనిగడ్డ ఏ-1 మార్ట్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో బీసీ నేతలు డిమాండ్ చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ అధ్యక్షత వహించగా, బీసీ నేత తిరుపతి శ్రీనివాసరావు, సైకం రాజశేఖర్, ఏపీ బీసీ చైతన్యవేదిక అధ్యక్షుడు రమణ, ఏఐసీసీ నేత కోట కరుణ్ కుమార్, ఎస్సీ నేత బోడే వెంకన్న, వడ్డెర సంఘ నేత బి.వెంకటేశ్వరరావు, ఎల్.ఆచారి, ఖాదర్ వలీ, దిడ్ల ప్రసాద్, నారేపా లెం శంకరరావు, అవనిగడ్డ రజనీకాంత్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అగ్నిప్రమాదం

చల్లపల్లి : పార్వతమ్మతోటలోని ఆదరణ అనాధ వృద్ధాశ్రమంలో తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఆశ్రమంలో ఉన్న 23 మంది వృద్ధులు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. కదలలేని కొందరు వృద్ధులను స్థానిక యువకులు సురక్షితంగా బయటకు తీసుకువెళ్లారు. ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెనుప్రమాదం తప్పినట్లయింది. ఆశ్రమానికి వేసిన సీలింగ్ పూర్తిగా కాలిపోగా, దుస్తులు, సామాగ్రి కాలిపోయింది.

పరీక్షా సామగ్రి వితరణ

బంటుమిల్లి : పెందుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ టెన్త్ పూర్వ విద్యార్థి, శ్రీ గణేష్ విద్యావిహార్ అధినేత కాసిన వెంకటేశ్వరరావు పరీక్షా సామగ్రి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, వెంట్రపాటి సురేష్ పాల్గొన్నారు.



బిళ్లపాడులో రేకుల షెడ్డు దగ్ధం

గుడివాడ రూరల్ : బిళ్లపాడులో ఆదివారం పడమటి కనకదుర్గ రేకుల షెడ్డు అగ్నికి ఆహుతైంది. గ్యాస్‌బండ పేలటంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పూర్తిగా ఇల్లు దగ్ధమైంది. కుటుంబసభ్యులు ఇంట్లో లేకపోవటంతో భారీ ప్రమాదం తప్పింది. మొత్తం కాలిబూడిద అయింది.